
సాక్షి
గుంటూరు
బుధవారం, 18, అక్టోబర్, 2023



చిత్ర కళాప్రదర్శన ప్రారంభం

ఏఎన్‌యూ: చిత్ర కళాప్రదర్శన మంగళవారం ప్రారంభమైంది. వీసీ పి.రాజశేఖర్, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్, కల్చరల్ కమిషన్ సీఈఓ మల్లికార్జునరావు ప్రదర్శనను తిలకించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 4,012 క్యూసెక్కులు విడుదల చేశారు.

అన్నపూర్ణాదేవిగా భువనేశ్వరి



నరసరావుపేట రూరల్: కోటప్పకొండలోని భువనేశ్వరి సమేత నీలకంఠేశ్వర స్వామి దేవస్థానంలో దసరా నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు మంగళవారం అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

సాగుకు జల అభయం

- పులిచింతల నుంచి మరో వెయ్యి క్యూసెక్కులు
- 4,600 క్యూసెక్కులకు పెరిగిన నీటి విడుదల
- పంట నష్టం జరగకుండా చూస్తాం
- ప్రణాళికాబద్ధంగా సాగునీరు సరఫరా చేస్తాం
- పంటకాల్వలను పరిశీలించిన కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



సంగజాగర్లమూడి లాకుల వద్ద నీటి సరఫరాను పరిశీలిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ

తెనాలి/తాడేపల్లి రూరల్/మంగళగిరి: రైతాంగానికి ఎటువంటి నష్టం జరగకుండా సాగునీటి కష్టాల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రైతుల ఆందోళనను దృష్టిలో పెట్టుకుని పులిచింతల నుంచి మరో వెయ్యి క్యూసెక్కులు అదనంగా విడుదల చేస్తోంది. దీంతో గత వారంలో మూడు వేల క్యూసెక్కులు ఉన్న నీటి ప్రవాహం మంగళవారం సాయంత్రానికి 4,600 క్యూసెక్కులకు చేరుకుంది. ఈ నేపథ్యంలో కాలువల ద్వారా సాగునీటి సరఫరాపైనా జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి మంగళవారం తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ, జలవనరులశాఖ అధికారులతో కలిసి కృష్ణాపశ్చిమ డెల్టా, గుంటూరు చానల్ పరిధిలోని పంట కాలువలను తనిఖీ చేశారు. తొలుత కృష్ణా పశ్చిమ డెల్టా ప్రధాన కాల్వ ఆరంభమయ్యే సీతానగరం హెడ్ రెగ్యులేటర్, గుంటూరు చానల్ ప్రారంభ రెగ్యులేటర్‌ను పరిశీలించారు. తర్వాత పెదవడ్లపూడి దగ్గర హైలెవల్ చానల్ ఆఫ్ టేక్ స్లూయిజ్, అక్కడే నిర్మాణంలో ఉన్న ఏపీఎస్ఐడీసీ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని సందర్శించారు. హైలెవల్ చానల్‌లో భాగమైన ఈస్ట్, వెస్ట్ కాల్వలు, రేవేంద్రపాడు లాకులు, దుగ్గిరాల లాకులు, అక్కడి నుంచి చీలే తూర్పు, పశ్చిమ, నిజాంపట్నం కాల్వలు, కొమ్మమూరు కాల్వ, సంగంజాగర్లమూడి వద్ద లాకులను సందర్శించారు. నీటి సరఫరా తీరుతెన్నులను పరిశీలించారు.

అధికారుల పర్యవేక్షణ అవసరం

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నీటి వనరులు తక్కువగా ఉన్న నేపథ్యంలో అదనపు నీటి సరఫరాకు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు. దీంతో పులిచింతల ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీటికి అదనంగా మరో 1,000 క్యూసెక్కులు తీసుకుంటున్నట్టు తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సాగునీరు అందక ఏ ఒక్క రైతు పైరూ ఎండిపోకూడదని స్పష్టంగా చెప్పారు. ఆ ప్రకారం నీటి సరఫరాను జాగ్రత్తగా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఆపరేషనల్ అండ్ మెయింటెనెన్స్ పనులు ఎక్కడైనా పెండింగ్‌లో ఉంటే యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని, రైతులకు మేలు చేకూర్చేందుకు అవసరమైతే అదనపు యంత్రాలను వినియోగించాలని ఇంజినీరింగ్ అధికారులకు చెప్పారు. కృష్ణాపశ్చిమ డెల్టా పరిధిలో 1.84 లక్షల ఎకరాలు, గుంటూరు చానల్ పరిధిలోని 27 వేల ఎకరాలు, ఇతర మైనర్ ఇరిగేషన్ పరిధిలోని ఆయకట్టు అంతటికీ ప్రణాళికాబద్ధంగా సాగునీరు విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేశారు. సాగునీటి కాల్వల పరిశీలనలో మంగళగిరి, తెనాలి, తాడేపల్లి, దుగ్గిరాల మండలాల తహసీల్దార్లు రాంప్రసాద్, నాగిరెడ్డి, మల్లేశ్వరి, జలవనరులశాఖ పర్యవేక్షక ఇంజినీరు ఉమామహేశ్వరరావు, కృష్ణాపశ్చిమ విభాగం కార్యనిర్వాహక ఇంజినీరు మల్లికార్జున, గుంటూరు డివిజన్ కార్యనిర్వాహక ఇంజినీరు ఎస్‌వీకే ప్రసాద్, ఉప కార్యనిర్వాహక ఇంజినీరు వి.కృష్ణా, సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్లు పాల్గొన్నారు.



జలవనరుల శాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ఎత్తిపోతల పథకం పూర్తికి కృషి

పెదవడ్లపూడి హైలెవల్ చానల్ వద్ద చేపట్టిన ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించి పనులు ఎందుకు ఆగాయని, ప్రభుత్వం నుంచి ఎంత మొత్తం నిధులు మంజూరు కావాలనే వివరాలతో నివేదిక రూపొందించి వెంటనే తనకు అందజేయాలని కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. ఎత్తిపోతల పథకం సత్వరమే పూర్తయ్యేలా చర్యలు తీసుకుని సాగునీటి సరఫరాను మరింత మెరుగుపరుస్తామని తెలిపారు. అనంతరం నీటి సరఫరా ప్రణాళికపై జలవనరుల శాఖ అధికారులతో చర్చించారు. సమావేశంలో నీటి పారుదల శాఖ ఎస్ఈ ఉమామహేశ్వరరావు, ఈఈ సంకారపు మల్లికార్జున, డీఈ ఎస్‌కేవీ ప్రసాద్, మంగళగిరి, దుగ్గిరాల ఏఈలు విద్యావతి, వనిత పాల్గొన్నారు.

పేదలకు నాణ్యమైన వైద్యం

- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- వినుకొండలో అత్యవసర చికిత్స భవనం ప్రారంభం
- రూ.2.10 కోట్లతో నిర్మాణం



అత్యవసర విభాగాన్ని ప్రారంభిస్తున్న మంత్రి రజిని, ఎమ్మెల్యే బొల్లా, మాజీ ఎమ్మెల్యే మక్కెన తదితరులు

వినుకొండ(నూజెండ్ల) : వినుకొండ పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో రూ.2.10 కోట్లతో నిర్మించిన అత్యవసర చికిత్స విభాగం భవనాన్ని మంగళవారం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోనూ వైద్యసేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు విలేజీ హెల్త్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ వంటి వినూత్న కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. ఇటీవల చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతంగా నడుస్తోందని వివరించారు. వినుకొండలో 30 పడకల వైద్యశాలకు అనుసంధానంగా త్వరలోనే 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామన్నారు. పల్నాడు జిల్లాలో రూ.500 కోట్లతో పిడుగురాళ్ల వద్ద మెడికల్ కళాశాల నిర్మాణంలో ఉన్నట్లు చెప్పారు. మార్కాపురంలో రూ.475 కోట్లతో త్వరలోనే మెడికల్ కళాశాలను అందుబాటులోకి తెస్తామన్నారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ సహకారాలతో ఆరోగ్య శాఖ మంత్రి పర్యవేక్షణలో వినుకొండలో ట్రామా కేర్ సెంటర్, వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామన్నారు. వినుకొండ అభివృద్ధిలో పాలుపంచుకున్న మంత్రి రజినికి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఆస్పత్రిని బందెలదొడ్డిగా మార్చారని, పందులు సంచరిస్తున్న ఆస్పత్రిని అభివృద్ధి చేసి మూడుసార్లు అవార్డులు అందుకున్న ఆస్పత్రిగా రికార్డు సృష్టించామన్నారు. ఈపూరు మండలంలో రూ.6 కోట్ల నిధులతో నూతన ఆస్పత్రి నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్, డీఎం అండ్‌హెచ్‌వో పి.రవి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ఆరె సామ్రాజ్యం, మార్కెట్‌యార్డు చైర్మన్లు బత్తుల వెంకటేశ్వర్లుయాదవ్, చుండూరి వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ విజయలక్ష్మి రాజా, జిల్లా కో-ఆప్షన్ మెంబరు గుండాల స్వినోమ్, మున్సిపల్ వైస్ చైర్మన్ తెల్లాకుల రాజేష్‌ఖన్నా, పట్టణ పార్టీ అధ్యక్షులు పీఎస్ ఖాన్, మండల పార్టీ అధ్యక్షులు దండు చెన్నయ్య, వార్డు కౌన్సిలర్లు పాపసాని బ్రహ్మయ్య, ఎంఎస్‌కే బాషా, రెడ్డి నాగపద్మ, కొత్త మాసు శివ, ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అబ్దుల్ రజాక్, డాక్టర్ లీలానందిని, డాక్టర్ సౌమ్య పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని వేదికపై ఎమ్మెల్యే బొల్లా, జేసీ శ్యామ్‌ప్రసాద్

న్యూస్‌రీల్

గాయత్రీదేవిగా బాలచాముండేశ్వరి



అమరావతి: అమరావతి బాలచాముండిక సమేత అమరేశ్వరాలయంలో శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా మంగళవారం బాలచాముండేశ్వరి అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు. సహస్ర కుంకుమార్చన, దేవి ఖడ్గమాల, త్రిశల, లలితా సహస్రనామార్చన, శ్రీచక్రార్చనతోపాటుగా గాయత్రీదేవికి సంధ్యా సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని జ్వాలాముఖి, మహిషాసురమర్దని అమ్మవార్లకూ ప్రత్యేక పూజలు చేశారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. సీతాసమేత కోదండరామస్వామి దేవస్థానంలోని అద్దాలమహల్‌లో వాసవీ కన్యకాపరమేశ్వరి అలంకారం చేశారు.

ఎన్నికల సామగ్రి సిద్ధం చేసే ప్రక్రియ ప్రారంభం

తనిఖీ చేసిన కలెక్టర్ శివశంకర్



నరసరావుపేట: ఈవీఎం, వీవీ ప్యాట్ల మొదటి దశ తనిఖీ ప్రక్రియను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శివశంకర్ లోతేటి మంగళవారం పరిశీలించారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్‌లో సోమవారం నుంచి ఎన్నికలలో వినియోగించే సామగ్రిని పరీక్షించి సిద్ధంచేసే ప్రక్రియ ప్రారంభమైన విషయం తెలిసిందే. అక్కడ ఏర్పాటు చేస్తున్న ప్రథమ చికిత్సా కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు అందజేశారు. అలాగే సిబ్బందికి అందిస్తున్న భోజన వసతిని పరిశీలించారు. సిబ్బంది హాజరు వివరాలు సేకరించి, హాజరు పట్టికను పరిశీలించారు. సిబ్బంది సెల్ ఫోన్లను భద్రపరిచే గదిని తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట గోడౌన్ ఇన్‌చార్జి, డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్, మండల రెవెన్యు అధికారి ఆర్‌వీ రమణానాయక్ ఉన్నారు.

ప్రథమస్థానంలో తెనాలి ఆర్టీసీ డిపో

గుంటూరు రీజనల్ మేనేజర్ పి.రవికాంత్



తెనాలిఅర్బన్: ఆదాయాన్ని సమకూర్చే విషయంలో జోన్‌లోనే తెనాలి ఆర్టీసీ డిపో ప్రథమ స్థానంలో ఉందని గుంటూరు రీజనల్ మేనేజర్ పి.రవికాంత్ పేర్కొన్నారు. తెనాలి డిపోను మంగళవారం ఆయన పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం ఉద్యోగులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో తెనాలి రాష్ట్ర స్థాయిలో మంచి స్థానంలో ఉండేలా చూడాలని సూచించారు. డిపోలో మరిన్ని వసతులు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఉద్యోగులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఎస్‌బీఐ రూపే కార్డులను అందరూ కలిగి ఉండాలని చెప్పారు. అనంతరం లక్ష్యాలు సాధించిన ముగ్గురు కండక్టర్లకు క్యాష్ అవార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేటి నుంచి వర్సిటీ వసతి గృహాలకు సెలవులు

ఏఎన్‌యూ(గుంటూరు): యూనివర్సిటీ కళాశాలలకు దసరా సెలవులు ఇవ్వడంతో వసతి గృహాలకు బుధవారం సాయంత్రం నుంచి సెలవులు ప్రకటించారు. పీజీ బాలుర, బాలికల హాస్టళ్లను ఈనెల 25 మధ్యాహ్నం నుంచి, ఇంజినీరింగ్ కళాశాల వసతి గృహాన్ని ఈనెల 26 మధ్యాహ్నం నుంచి తిరిగి ప్రారంభిస్తామని బాలుర, బాలికల వసతి గృహాల చీఫ్ వార్డెన్లు ప్రొఫెసర్ జి.నాగరాజు, ప్రొఫెసర్ వి.వెంకటరత్నమ్మ, ప్రొఫెసర్ పి.సిద్ధయ్య తెలిపారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.2,000, గరిష్ట ధర రూ.3,200, మోడల్ ధర రూ.2,500 వరకు పలికింది.

అభి'వృత్తి'కి చేదోడు

- రేపు జగనన్న చేదోడు నాలుగోవిడత ఆర్థిక సాయం మంజూరు
- జిల్లాలో 8,513 మందికి లబ్ధి
- రూ.8.51 కోట్ల మేర ప్రయోజనం



నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): కష్టాల్లో కూరుకుపోతున్న కులవృత్తిదారులకు చేయూత ఇచ్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న చేదోడు పథకం ద్వారా గురువారం నాలుగో విడత ఆర్థికసాయం మంజూరు కానుంది. ఇప్పటికే వలంటీర్లు, సచివాలయ సిబ్బంది జియో ట్యాగింగ్ సర్వే ద్వారా లబ్ధిదారులను పూర్తి పారదర్శకతతో ఎంపిక చేశారు. జిల్లాలో ఈ పథకానికి 8,513 మంది అర్హత సాధించారు. వీరిలో 4,767 మంది మహిళలు, 3,746 మంది పురుషులు ఉన్నారు. ఒక్కో లబ్ధిదారు ఖాతాలో రూ.10,000 జమ కానుంది. అందరికీ కలిపి మొత్తం రూ.8,51,30,000 మేర ప్రయోజనం చేకూరనుంది.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక



ప్రభుత్వ నియమ, నిబంధనల మేరకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పార్టీలకు అతీతంగా లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేశాం. కులవృత్తిదారులకు 19న బ్యాంకు ఖాతాల్లో రూ.10 వేలు జమకానున్నాయి.

– డి.దుర్గాబాయి బీసీ కార్పొరేషన్ ఈడీ

ఇప్పటివరకు నగదు జమ ఇలా..

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	విడుదలైన నిధులు (రూ.కోట్లలో)
2020 –21	9,185	9.19
2021–22	8,817	8.82
2022–23	9,843	9.84
(నవరత్నాలు ద్వి వార్షికం)	1,020	1.12
మొత్తం	28,865	28.97

నియోజకవర్గాల వారీగా నాలుగోవిడత లబ్ధిదారులు ఇలా..

నియోజకవర్గం	మహిళలు	పురుషులు	మొత్తం
గుంటూరు పశ్చిమ	969	618	1,587
గుంటూరు తూర్పు	862	425	1,287
తెనాలి	695	654	1,349
పొన్నూరు	593	502	1,095
ప్రత్తిపాడు	545	533	1,078
తాడికొండ	571	493	1,064
మంగళగిరి	532	521	1,053
మొత్తం	4,767	3,746	8,513



అన్నపూర్ణా అభివందనం

పెదకాకాని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులను అనుగ్రహించారు. మంగళవారం మూడోరోజు అమ్మకు అర్చకులు విశిష్ట పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా ఏర్పాట్లను ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, దేవస్థాన చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు పర్యవేక్షించారు. రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర నాటకం ఆద్యంతం అలరించింది. – పెదకాకాని

ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ జిల్లా సమన్వయకర్త కార్యాలయం పరిధిలో వైద్య ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానించనున్నట్లు వైద్య విధాన పరిషత్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ సుబ్రహ్మణ్య రాజు మంగళవారం తెలిపారు. ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, రేడియోగ్రాఫర్, థియేటర్ అసిస్టెంట్, జనరల్ డ్యూటీ అటెండెంట్, పోస్టుమార్టం అసిస్టెంట్ ఉద్యోగాలకు అర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయం ఆవరణలోని జిల్లా ఆస్పత్రుల సమన్వయ కార్యాలయంలో అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు గుంటూరు.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని కోరారు.

రబీ సాగుకు సమాయత్తంపై వర్క్‌షాప్

గుంటూరు రూరల్: రైతులను రబీ సాగుకు సమాయత్తం చేయాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి కోరారు. నగర శివారుల్లోని లాంలోని వర్సిటీ సమావేశ మందిరంలో రబీ సాగు సమాయత్తంపై వర్క్‌షాపు మంగళవారం నిర్వహించారు. సమావేశానికి విస్తరణ సంచాలకుడు డాక్టర్ ఎ.సుబ్బరామిరెడ్డి అధ్యక్షత వహించారు. వీసీ మాట్లాడుతూ ఉష్ణోగ్రతలలో తేడాల వలన, అకాల వర్షాల వలన చీడపీడల ఉధృతి పెరగవచ్చని తెలిపారు. శాస్త్రవేత్తలు సరైన సమయంలో కచ్చితమైన సాంకేతిక సలహాలను వ్యవసాయ శాఖ అధికారులకు, ఆర్‌బీకే సిబ్బందికి, రైతులకు అందించాలని సూచించారు. పరిశోధన సంచాలకురాలు డాక్టర్ ఎల్.ప్రశాంతి మాట్లాడుతూ విస్తరణ శాస్త్రవేత్తలు పరిశోధన అంశాలను పొలాల్లో పరిశీలించి స్పష్టమైన అభిప్రాయాలను పరిశోధన శాస్త్రవేత్తలకు అందించాలని చెప్పారు. కార్యక్రమంలో భారత వ్యవసాయ పరిశోధన మండలి ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్‌వీ సాయిప్రసాద్, డాక్టర్ పి.సంజనారెడ్డి, డాక్టర్ టి.భూపతి, రబీ పంటల్లో సమాయత్తంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ బాలునాయక్, జేడీఏ కృపాదాస్ పాల్గొన్నారు.

యార్డుకు 25,756 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 25,756 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 24,749 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి 26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,000 నుంచి 26,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 10,216 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

చంద్రబాబు ఇక జైల్లోనే...

- మంగళగిరి ఎమ్మెల్యే ఆర్కే
- అన్యాయమైన రైతుల ఉసురు తగిలింది

తాడేపల్లిరూరల్: ఇక చంద్రబాబు నాయుడు జీవితం జైల్లోనే అని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గుంటూరు జిల్లా తాడేపల్లి సీతానగరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కేను విలేకరులు అడిగిన వాటికి సమాధానం చెబుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాజధాని పేరుతో పేద రైతుల దగ్గర భూ దోపిడీకి ప్రయత్నం చేశారని చెప్పారు. దానికి సంబంధించి అప్పట్లో 40– 50 భూ విషయాలకు సంబంధించి గౌరవ న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో కొంతమేర రైతులకు న్యాయస్థానం అండగా నిలిచి దోపిడీని అడ్డుకుందని వివరించారు. రాజధానిలో ఉన్న చిన్న, సన్నకారు రైతులను అసైన్డ్ భూముల రైతులను రాజకీయాన్ని, అధికారులను అడ్డం పెట్టుకుని బెదిరించి వారి భూములను అతి తక్కువ ధరకు కొనుగోలు చేశారని, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలను మోసం చేశారని,



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్కే

ఇప్పుడు వారి ఉసురే ఆయనకు తగిలిందని, మొదటి నుంచి చంద్రబాబు నాయుడు దోపిడీపై మేము పోరాటం చేస్తూనే ఉన్నామని, ఎట్టకేలకు ఆయన అవినీతి బాగోతాలు ఒక్కటొక్కటిగా బయటకు వస్తున్నాయని, ఇక ఆయన జైలుకే అంకితం అవుతారని అన్నారు.

అధికారంలో ఉన్నప్పుడు ఐఏఎస్ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి..

అందుకు సంబంధించి 2019, 2020లో కేసులు గౌరవ న్యాయస్థానం పరిగణలోకి తీసుకోవడం, ఇప్పుడు చంద్రబాబును దోషిగా నిలబెట్టడానికి ఎంతగానో ఉపయోగపడ్డాయని ఆయన అన్నారు.

మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావును వెన్నుపోటు పొడిచినప్పుడు కొంతమంది నాయకులు చంద్రబాబుకు అండగా నిలిచారని, అలాంటి వారు ఇప్పుడు ప్రజల పక్షాన ఏ విధంగా నిలుచుంటారో మనందరం ఆలోచించాలని అన్నారు. 2014లో శ్రీకృష్ణ కమిటీ ఇచ్చిన నివేదికకి విరుద్ధంగా ఆయన వ్యాపారాల కోసం ఇక్కడ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ రైతులను మోసం చేసేందుకు భూ దోపిడీకి తెరలేపారని చెప్పారు. అక్రమంగా భూమిని దోచుకున్నారని, 1943–44లో అసైన్డ్ చేసిన భూములు కలిగిన రైతులను అధికారులతో, రాజకీయ నాయకులతో బెదిరించి రెండు మూడు లక్షలకు కొనుగోలు చేశారని వివరించారు. అనంతరం జీవో నంబర్ 41ను తీసుకువచ్చి కొనుగోలు చేసిన ఆయన బినామీలకు లబ్ధి చేకూరే విధంగా చేసి రైతులను మోసగించారని ఆయన అన్నారు.

క్రీడల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- వీసీ ఆచార్య రాజశేఖర్
- పతకాల గ్రహీతలకు సత్కారం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో క్రీడాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వైస్‌చాన్స్‌లర్ పి.రాజశేఖర్ పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలలో పతకాలు సాధించిన యూనివర్సిటీ క్రీడాకారులకు మంగళవారం నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ క్రీడాకారులకు అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి విశ్వవిద్యాలయం సిద్ధంగా ఉందని వెల్లడించారు. విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం నుంచి వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్– 2023లో 100 మీటర్ల హర్డిల్స్‌లో కాంస్య పథకం సాధించిన జ్యోతికి రూ.లక్ష ఖర్చులతో పాటు మరొక లక్ష రూపాయలను బహుమతిని వీసీ ప్రకటించారు. ఈ ఏడాది మొత్తం ఐదు పథకాలను యూనివర్సిటీ నుంచి క్రీడాకారులు సాధించారన్నారు. జాతీ య, అంతర్జాతీయ క్రీడాపోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులకు అదనంగా మార్కులు ఇచ్చి ప్రోత్సహించే విశ్వవిద్యాలయాల్లో దేశంలోనే మన వర్సిటీ మూడో స్థానంలో నిలిచిందని చెప్పారు. నగదు బహుమతి, స్పోర్ట్స్ స్కాలర్‌షిప్, సూపర్ న్యూమరి సీటు(50 శాతం ఫీజు రాయితీ) వంటివి ముఖ్యమైన ప్రోత్సాహకాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా మరిన్ని విజయాలు సాధించాలని సూచించారు. వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పి.జాన్సన్ మాట్లాడుతూ ఏఎన్‌యూ క్రీడా రంగంలో పురోగమిస్తుందన్నారు. యోగా కో ఆర్డినేటర్ డాక్టర్ సూర్యనారాయణమాట్లాడుతూ వ్యాయామ విద్యాశాఖ ఆధ్వర్యంలో 2022 –23 సంవత్సరానికి అంతర్ విశ్వవిద్యాలయాల క్రీడా పోటీల్లోనూ, ఖేలోఇండియా యూనివర్సిటీ గేమ్స్– 2023 లోను, వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్– 2023 లోను, పతకాలు సాధించిన విశ్వవిద్యాలయ క్రీడాకారులకు నగదు ప్రదానం చేసినట్లు వివరించారు.



క్రీడాకారులకు నగదు బహుమతులు అందజేస్తున్న వీసీ ఆచార్య రాజశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య కరుణ

సంక్షేమం దిశగా టెక్స్‌టైల్ రంగం

- అన్ని విధాలా ఆదుకుంటామన్న ప్రభుత్వ విప్ లేళ్ళ అప్పిరెడ్డి
- అప్పిరెడ్డిని సత్కరించిన ఏపీ టెక్స్‌టైల్ అసోసియేషన్

పట్నంబజారు: కరోనా తర్వాత దేశంలోనే సంక్షోభం బారిన పడిన అనేక రంగాలలో టెక్స్‌టైల్ రంగం కూడా ఒకటని శాసనమండలి శాసనమండలి విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి చెప్పారు. ఈ రంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. శాసన మండలిలో ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు స్వీకరించిన అప్పిరెడ్డిని ఏపీ టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం విద్యానగర్‌లోని ఒక హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. ఇందులో భాగంగా టెక్స్‌టైల్ పరిశ్రమలు పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయాయని అసోసియేషన్ సభ్యులు విప్ అప్పిరెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వమే తమ రంగానికి అండగా నిలవాలని, తమ సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా విప్ అప్పిరెడ్డి మాట్లాడుతూ ఇప్పుడిప్పుడే టెక్స్‌టైల్ రంగం సంక్షోభం నుంచి సంక్షేమం దిశగా అడుగులు వేస్తోందని, ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించేందుకు సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నూతన పరిశ్రమలు స్థాపన మొదలైందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఛైర్మన్ పెరవలి కోటిరావు, సాదినేని కోటేశ్వరరావు, మాజీ ఛైర్మన్ గోరంట్ల పున్నయ్య చౌదరి, అసోసియేషన్ గౌరవ ఛైర్మన్ లంకా రఘురామిరెడ్డి, వైస్ ఛైర్మన్లు సామినేని కోటేశ్వరరావు, ఎం.వి.సత్యనారాయణ, పూర్ణ వీరయ్య, కళ్ళం నాగిరెడ్డి, బత్తినేని బెనర్జీ, కార్యదర్శి మల్లేశ్వర కుమార్ పాల్గొన్నారు.



విప్ అప్పిరెడ్డిని సత్కరిస్తున్న సభ్యులు, చిత్రంలో ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

గుంటూరు మీదుగా ప్రత్యేక రైళ్లు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్ మీదుగా ప్రయాణీకుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు కేటాయించడం జరిగిందని గుంటూరు రైల్వే డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ మంగళవారం వెల్లడించారు. రైలు నంబరు 07065 సికింద్రాబాద్ – కాకినాడ రైలు ఈనెల 23న ప్రత్యేక రైలు కేటాయించినట్లు వెల్లడించారు. 07066 కాకినాడ–సికింద్రాబాద్ ఈనెల 24న ప్రత్యేక రైలు వయా గుంటూరు డివిజన్ మీదుగా కేటాయించినట్లు తెలిపారు. ఈరైలు సికింద్రాబాద్, నల్గొండ, కృష్ణకెనాల్, గుడివాడ, మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు.

మాకూ కావాలి జగన్



బజరంగ్ సీఈఓ అంబటి మురళీకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న వివిధ రాష్ట్రాల భవన నిర్మాణ కార్మికులు

- మాకు అందించండి సంక్షేమం
- నినదించిన వలస కార్మిక లోకం
- ఏపీలో ఓటు హక్కు కల్పించి సంక్షేమ ఫలాలు అందించాలని వినతి

కొరిటెపాడు(గుంటూరు): బిహార్, ఒడిశా, పశ్చిమ బంగ రాష్ట్రాల నుంచి వలస కూలీలుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పనిచేస్తున్న వారంతా ముక్త కంఠంతో 'మాకూ కావాలి జగన్' అంటూ నినదిస్తున్నారని బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ తెలిపారు. వివరాల్లోకి వెళితే గుంటూరు నగరం, నల్లపాడులలో నివసిస్తున్న బిహార్, ఒడిశా, పశ్చిమ బంగ రాష్ట్రాలకు చెందిన సుమారు 500 మంది వలస కార్మికుల కుటుంబాలు బజరంగ్ నిర్మాణంలో ఉన్న గ్రీన్ గ్రేస్ ప్రాజెక్టులో పనిచేస్తున్నారు. వారి ఇరుగుపొరుగులో 200 కుటుంబాల తెలుగువారు ఉన్నారు. వీరంతా ఏపీలో అమలవుతున్న సంక్షేమ పథకాలను పొందుతున్నారు. ఇదంతా చూసిన వలస కార్మికులు తీవ్ర భావోద్వేగానికి గురై, తాము స్వస్థలాలకు తిరిగి వెళ్లబోమని, ఈ సంక్షేమ పాలనలో తమను కూడా భాగస్వాములను చేయాలని కోరారు. తమ ఆధార్ కార్డులలో చిరునామాను ఇక్కడకు మార్చుకుంటామని, ఇక్కడే తమకు ఓటు హక్కును అనుమతించాలని కోరుతూ బజరంగ్ సీఈఓ అంబటి మురళీకృష్ణ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విజ్ఞప్తి చేస్తూ మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బజరంగ్ సీఈఓ అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సును, వారి జీవితాల్లో నిజమైన అభివృద్ధిని ఆకాంక్షిస్తూ, అత్యంత పారదర్శక విధానంలో సంక్షేమ ఫలాలను క్షేత్రస్థాయికి తీసుకువెళ్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి కార్యరూపం దాల్చేలా చూస్తానని వారికి మురళీకృష్ణ హామీ ఇచ్చారు.

హత్య కేసులో నిందితుడికి యావజ్జీవం

తెనాలిరూరల్: హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దుగ్గిరాల మండలం చిలువూరుకు చెందిన కాబోతు పూర్ణశేఖర్ 2019 మే 14వ తేదీన వైన్ షాప్‌వద్ద మద్యం తాగుతుండగా అతని బంధువు సన్నెకంటి నరేష్‌బాబు అలియాస్ నరేష్ అక్కడికి వచ్చి తనకు మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అందుకు అతను నిరాకరించడంతో ఘర్షణ పడి పక్కనే ఉన్న బీరు సీసాను పగులగొట్టి గొంతులో పొడవడంతో పూర్ణశేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసును దుగ్గిరాల పోలీసులు నమోదు చేయగా అప్పటి తెనాలి రూరల్ సీఐ యు. సుధాకరరావు కేసు దర్యాప్తు చేసి నిందితుడిని కోర్టులో హాజరు పరిచారు. కేసు మంగళవారం విచారణకు రావడంతో సాక్షాధారాలను పరిశీలించిన 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.మాలతి, నిందితుడు నరేష్‌కు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలన్నారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్‌ప్రాసిక్యూటర్ దాట్ల మోహన్‌రెడ్డి వాదించారు.

చోరీ చేసి దొరికిపోయిన నిందితుడు

తక్కువ సమయంలో కేసును ఛేదించిన పోలీసులు

మేడికొండూరు: మండల పరిధిలోని భీమినేని వారి పాలెంలో ఈనెల 10న పట్టపగలు ఓ ఇంట్లో చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి ప్రవేశించి మహిళలపై దాడి చేశారు. బీరువాలో ఉన్న నగదు అపహరించుకు పోయారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు తక్కువ సమయంలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తుళ్లూరు డీఎస్పీ పోతురాజు మంగళవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నిందిగుడి నుంచి మూడు రాబరి, ఐదు ద్విచక్ర వాహనాల చోరీతోపాటు, పాటేలు చోరీ కేసులు ఉన్నట్లు తెలిపారు. నేర చరిత్ర ఉన్న వ్యక్తిగా వెల్లడించారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణంలోని లెనిన్ కాలనీకి చెందిన కె.దుర్గాప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. మరో వ్యక్తి పిడుగురాళ్ల ఆదర్శ కాలనీకి చెందిన శేషగిరి అలియాస్ ఎలిషా పరారీలో ఉన్నట్లు, అతని కోసం పోలీసులు గాలిస్తున్నట్లు వెల్లడించారు. చోరీ జరిగిన వారం రోజుల్లోపు కేసును ఛేదించడంలో ప్రతిభ కనబర్చిన మేడికొండూరు సీఐ వాసు, ఎస్సై మధుపవన్, పీసీలు జి.సిద్ధయ్య, వై.మాణిక్య రావు, షేక్ నజీర్, ఒ.డేవిడ్, కె.రామారావు, కానిస్టేబుళ్లను గుంటూరు ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ అభినందనలు తెలిపి రివార్డులు ప్రకటించారు. రివార్డులు డీఎస్పీ పోతురాజు పంపిణీ చేశారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ పోతురాజు, సీఐ వాసు

సాక్షి ఫ్యామిలీ
గుంటూరు
బుధవారం ॥ 18-10-2023

ప్రతిభ

మన చుట్టూ మనకు తెలియకుండానే ఎంతో మంది రకరకాల బాధలకు లోనవుతుంటారు. వారిలో ముఖ్యంగా వృద్ధులు, వికలాంగుల సమస్యలకు సరైన పరిష్కారం తెలియక ఇబ్బందులు పడుతుంటారు. వారి మానాన వారిని అలాగే వదిలేయడం కన్నా పరిష్కారాన్ని కనుగొంటాను అనుకున్నాడు. తనదైన మార్గంలో ప్రయత్నించాడు. విజయం సాధించాడు. సత్కారాలను పొందుతున్నాడు హైదరాబాద్ వాసి హేమేష్ చదలవాడ.


తల్లి సంధ్యతో హేమేష్ చదలవాడ

అమ్మమ్మలకు అండగా!

దేశవ్యాప్తంగా వివిధ రంగాలలో సేవలు అందించిన 21 ఏళ్ల లోపు 20 మంది యువ సాధకులను ఢిల్లీలో మొన్న జరిగిన 'అన్‌స్టాపబుల్ 21' వేదికగా సత్కరించారు. హ్యూమన్ స్టడీస్, సైన్స్, క్రీడలు, ఫైన్ ఆర్ట్స్, పెర్ఫార్మింగ్ ఆర్ట్, సోషల్ ఇంపాక్ట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అనే ఏడు రంగాలలో ప్రతిభావంతులైన యువతకు ఈ సత్కారాన్ని అందజేశారు. వారిలో హైదరాబాద్‌కు చెందిన 16 ఏళ్ల హేమేష్ చదలవాడ ఎలక్ట్రానిక్స్ రంగంలో కనబరిచిన ప్రతిభకు గుర్తింపు పొందాడు.


హేమేష్ తయారుచేసిన డివైజ్

> మా అమ్మమ్మ వయసున్న వారు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు ఇది సరైన పరిష్కారం సూచిస్తుంది. ఎంతో మందికి సాయం చేస్తుందని ప్రామిస్ చేస్తున్నాను.
> – హేమేష్

వృద్ధులకు సహాయం..

హేమేష్ పన్నెండేళ్ల వయసు నుంచి ఎలక్ట్రానిక్స్, రోబోటిక్స్ రంగంలో గణనీయమైన ప్రతిభను చూపుతున్నాడు. అల్జీమర్స్ వ్యాధితో బాధపడుతున్న అమ్మమ్మను చూసి ఆమెకు ఏదైనా సాయం చేయాలనుకున్నాడు. తన ఆలోచనల గురించి హేమేష్ చెబుతూ 'నడిచేటప్పుడు అమ్మమ్మ అడుగులు తడబడుతుండేవి. మతిమరపు ఉండేది. ఆమెకు తన మీద తనకు కంట్రోల్ ఉండేది కాదు. కొన్నిసార్లు అర్ధరాత్రి మంచంపై నుంచి లేచి ఎటో వెళ్లిపోయేది. దీంతో ఆమెను కనిపెట్టి ఉండటం కష్టమయ్యేది. అమ్మమ్మకు, ఆమెను చూసుకునే మాకూ ఇదో సవాల్‌గా ఉండేది. కొన్ని అందుబాటులో ఉన్న డివైజ్‌లను ప్రయత్నించి చూశాం. కానీ, ఏ మాత్రం సంతృప్తిగా అనిపించలేదు. అమ్మమ్మకు సాయపడే డివైజ్‌ను నేనే సొంతంగా తయారుచేయాలనుకున్నాను' అని తనలో రూపుదిద్దుకున్న ఆలోచనను వివరిస్తాడు. హేమేష్ కృషి, పట్టుదల, అంకితభావానికి అతని తల్లిదండ్రులు కిశోర్, సంధ్యలు ప్రోత్సాహం అందించారు.

పరికరం ఎలా పనిచేస్తుందంటే..

ఈ పరికరం వాచ్‌లాగా మణికట్టుకూ కట్టుకోవచ్చు. బ్యాడ్జ్‌గానూ ధరించవచ్చు. రోగి నడక, భంగిమ, శరీర ఉష్ణోగ్రత, నాడిని పర్యవేక్షిస్తుంది. నీళ్ల జారిపడుతుండే శబ్దాన్ని కూడా గుర్తించగలదు. మనిషి దూరంగా తిరుగుతున్నప్పుడు లేదా పడిపోవడం వంటి ప్రమాదంలో ఉన్నప్పుడు వెంటనే తెలియజేస్తుంది. ఇంకా అలారంలో 'పిల్‌బాక్స్' ఫీచర్ కూడా ఉంటుంది. ఇది రోగులు వారి మందులు తీసుకునే సమయం వచ్చినప్పుడు హెచ్చరికలను పంపుతుంది. 'ఈ డివైజ్ మా అమ్మమ్మ కోసం తయారుచేసినప్పుడు ఇంటర్నెట్ సరైన మార్గం చూపింది. అయితే, ఈ పరికరం పూర్తయ్యే సరికి అమ్మమ్మ చనిపోయారు' అని బాధపడే హేమేష్ డివైజ్ చేతిలో పట్టుకొని 'మా అమ్మమ్మ వయసున్న వారు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు ఇది సరైన పరిష్కారం సూచిస్తుంది. ఎంతోమందికి సాయం చేస్తుందని ప్రామిస్ చేస్తున్నాను' అని చెబుతున్న హేమేష్ 12వ తరగతి చదువుతున్నాడు. తన తదుపరి ప్రాజెక్ట్‌తో ఎలక్ట్రానిక్స్, రోబోటిక్ రంగంలో మరిన్ని అడుగులు వేస్తున్నట్టుగా వివరించాడు.

2021లో ప్రధానమంత్రి చేతుల మీదుగా రాష్ట్రీయ బాల పురస్కారాన్ని అందుకున్నాడు. పేరున్న కంపెనీల నుంచి గ్రాంట్‌లను పొందాడు.


– నిర్మలారెడ్డి

మణిపూర్ ఒక మంచి వార్తను వినిపించింది. ఆ రాష్ట్రానికి చెందిన మహిళా దర్శకురాలు మీనా లాంగ్‌జామ్ తీసిన 'ఆంద్రో డ్రీమ్స్' ముంబైలో జరుగుతున్న చలన చిత్రోత్సవంలో బెస్ట్ డాక్యుమెంటరీగా ఎంపికైంది. మణిపూర్‌లోని మారుమూల గ్రామం 'ఆంద్రో'లో ఆడపిల్లల ఫుట్‌బాల్ క్లబ్‌ను 30 ఏళ్లుగా పరిస్థితులకు ఎదురీది నడుపుతున్న 'లైబి' అనే మహిళ పోరాటాన్ని ఈ డాక్యుమెంటరీ రికార్డు చేసింది. ఆడపిల్లల క్రీడా స్వేచ్ఛను ఎన్ని అడ్డంకులొచ్చినా కొనసాగనివ్వాలనే సందేశం ఇచ్చే ఈ డాక్యుమెంటరీ దేశ, విదేశాల్లో ప్రశంసలు పొందుతోంది.

అడ్డంకులను దూరంగా తన్ని...


దర్శకురాలు: మీరా లాంగ్‌జామ్

న్యూస్‌మేకర్


ఆంద్రో డ్రీమ్స్ పోస్టర్

అంతా చేసి ఎనిమిది వేల మంది జనాభా మించని ఊరు ఆంద్రో. మణిపూర్ తూర్పు ఇంఫాల్ జిల్లాలో మారుమూల ఉంటుంది అది. అక్కడి ఆడపిల్లలు ఫుట్‌బాల్ ఆడితే ఏంటి... ఆడకపోతే ఏంటి? కాని 60 ఏళ్ల లైబి మాత్రం– ఆడాల్సిందే అంటోంది. ఆమె గత ముప్పై ఏళ్లుగా 'ఆంద్రో మహిళా మండల్ అసోసియేషన్– ఫుట్‌బాల్ క్లబ్' (అమ్మ– ఎఫ్‌సీ) నడుపుతోంది. ఈ క్లబ్‌కు నిధులు లేవు. బిల్డింగ్ లేదు. ఊళ్లో ప్రోత్సాహం లేదూ, ఏమీ లేదు. కాని లైబి మాత్రం అంతా తానై క్లబ్‌ను నడుపుతోంది. ఈ మధ్యే ఆమె ఒక పూరి పాక నిర్మించి దానినే క్లబ్ బిల్డింగ్‌గా ప్రారంభించుకుంది.

'అమ్మాయిలు కేవలం వంటకు, ఇంటి పనికి అంకితమై పోకూడదు. చదువుకోవాలి. ఆడాలి. ధైర్యంగా భవిష్యత్తును నిర్మించుకోవాలి. మా ప్రాంతంలో పురుషులదే సర్వాధికారం. ఇంటి పెద్ద, తెగ పెద్ద ఎంత చెప్తే అంత. వారి దృష్టిలో ఆడవాళ్ల గురించి చింతించాల్సింది ఏమీ ఉండదు. అమ్మాయిలు ఆడతామన్నా ఒప్పుకోరు. నా పోరాటం వల్లే ఇవాళ మా ఊరి నుంచి జాతీయ స్థాయిలో అమ్మాయిలు ఫుట్‌బాల్ ఆడుతున్నారు' అంటుంది లైబి.



తన ఫుట్‌బాల్ క్లబ్ పూరి పాక ముందు లైబి

ఈమె పోరాటం ప్రపంచానికి చెప్పదగ్గది అనిపించింది మణిపూర్‌కే చెందిన మహిళా దర్శకురాలు మీనా లాంగ్‌జామ్‌కు. అలా తయారైన డాక్యుమెంటరీనే 'ఆంద్రో డ్రీమ్స్'.

ఇద్దరి కథ

ప్రస్తుతం ముంబైలో 'జాగరణ్ ఫిల్మ్ ఫెస్టివల్' అట్టహాసంగా జరుగుతోంది. ఇందులో 'ఆంద్రో డ్రీమ్స్' బెస్ట్ డాక్యుమెంటరీగా నిలిచింది. ఇప్పటికే కేరళ, కొరియన్ ఫిల్మ్ ఫెస్టివల్స్‌కు ఎంపికైన ఈ డాక్యుమెంటరీ ముంబైలో విమర్శకుల్ని విశేషంగా ఆకట్టుకుంది. 'దీనికి కారణం ఆంద్రోలో అమ్మ క్లబ్‌ను నడుపుతున్న లైబి పోరాటాన్ని, ఆ క్లబ్‌లో గొప్ప ఫుట్‌బాల్ ప్లేయర్‌గా ఉంటూ మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలనుకునే నిర్మల అనే అమ్మాయి ఆకాంక్షలని నేను చూపించడమే. ఒక రకంగా చాదస్త వ్యవస్థతో రెండు తరాల స్త్రీల పోరాటం ఈ డాక్యుమెంటరీ' అని తెలిపింది మీనా లాంగ్‌జామ్.

మణిపూర్ వెలుతురు

నిజానికి మే 3వ తేదీ నుంచి మణిపూర్ వేరే కారణాల రీత్యా వార్తల్లో ఉంది. కాని మణిపూర్‌ను అభిమానించేవారికి ఇప్పుడు ఈ డాక్యుమెంటరీ సాధిస్తున్న విజయాలు సంతోషాన్ని ఇస్తున్నాయి. 'నా డాక్యుమెంటరీ విజయం మా ప్రాంతంలో గతాన్ని మర్చిపోయి కొత్త జీవితం మొదలుపెట్టే ఉత్సాహాన్ని ఇస్తే అంతే చాలు' అంది మీనా లాంగ్‌జామ్. మణిపూర్ యూనివర్సిటీలో కల్చరల్ స్టడీస్‌లో ప్రొఫెసర్‌గా ఉన్న మీనా పాఠాలు చెప్పడంతో పాటు డాక్యుమెంటరీలు కూడా తీస్తుంది. 2015లో ఆమె మణిపూర్‌లో ఫస్ట్ మహిళా ఆటోడ్రైవర్‌గా ఉన్న లైబీ ఓయినమ్ మీద డాక్యుమెంటరీ తీస్తే దానికి చాలా పేరొచ్చింది. ఆ తర్వాత 'అచౌబీ ఇన్ లవ్' పేరుతో పోలో ఆటకు అనువైన స్థానిక జాతి అశ్వాలపై డాక్యుమెంటరీ తీస్తే దానికీ పేరొచ్చింది. ఇప్పుడు 'ఆంద్రో డ్రీమ్స్' మణిపూర్ ఘనతను చాటుతోంది.

బాలికలు, యువతులు క్రీడల్లో ఎంతో రాణిస్తున్నా ఇంకా గ్రామీణ ప్రాంతాల్లో ఆంక్షలు ఉండనే ఉంటాయి. అలాంటి ప్రతి చోట అమ్మాయిలను ప్రోత్సహించే లైబి లాంటి యోధురాళ్లు, వారి గెలుపు గాథలను లోకానికి తెలిపే మీనా లాంటి వాళ్లు ఉండాలని కోరుకుందాం.

● ఆటో అన్సారీ

లైఫ్ గేర్ మార్చింది


నజ్మా అన్సారీ

ఓ యువకుడు యాచకుడి వేషంలో, కేజీల మొత్తంలో కరెన్సీ నాణేలను తీసుకుని ఐఫోన్ కొనడానికి వెళ్లిన వార్త ఇటీవల సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది. మంచి వయసు, ఓపిక ఉన్న వారే ఇలా చేస్తుంటే... ఓపిక లేకపోయినా సమాజంలో గౌరవంగా బతికేందుకు బురఖా వేసుకుని ఆటో నడుపుతోంది నజ్మా అన్సారీ. అయినా ఇతరుల ముందు చేయి చాచే కంటే.. కష్టపడడమే గౌరవం అనుకుంది. 'గేర్లు మార్చేయండి చాలు గౌరవంగా బతకవచ్చు' అని చెబుతూ ఎంతో మందికి ప్రేరణగా నిలుస్తోంది.



నజ్మా అన్సారీ వయసు 45. ఉత్తరప్రదేశ్, మొరాదాబాద్ నగరంలోని కట్‌ఘర్‌లో ఆమె నివసిస్తోంది. ఆమెకు ఇద్దరు పిల్లలు. 2010లో భర్త మరణించడంతో ఇంటి భారం ఆమె మీద పడింది. అప్పటిదాక గృహిణిగా ఉన్న నజ్మాకు తన కొడుకు, కూతుర్ని ఎలా పెంచాలో అర్థం కాలేదు. భర్త నడిపిన టీషాపును అద్దె కట్టలేక వదిలేసింది. ఇంట్లోనే టీ తయారు చేసి విక్రయించింది. అలా పిల్లల అవసరాలు చూసుకుంటూ ఉండగానే భర్త ఇన్సురెన్స్ డబ్బులు రూ.4.35 లక్షలు వచ్చాయి. మూడు లక్షల రూపాయలతో 2015లో కూతురికి పెళ్లి చేసింది.

ఆదాయం సరిపోక..

టీ స్టాల్ నడుపుతూ కుటుంబాన్ని లాక్కొస్తున్న నజ్మాకు డబ్బులు సరిపోయేవి కావు. కూతురి పెళ్లి తరువాత ఆర్థిక ఇబ్బందులు పెరిగాయి. దీంతో భర్త ఇన్సురెన్స్ డబ్బుల్లో మిగిలిన మొత్తంతో ఎలక్ట్రిక్ ఆటో కొనుక్కుంది. ఇంటి పనులన్నీ పూర్తిచేసి ఆటో తోలుతూ సంపాదిస్తోంది.

అర్ధరాత్రనే భయం లేదు

నజ్మా మూడు షిఫ్టుల్లో ఆటో నడుపుతోంది. బురఖా ధరించి ఉదయం తొమ్మిదిగంటలకు ఆటో స్టార్ట్ చేస్తుంది. ఎండ వేడికి బురఖాలో ఎక్కువ సమయం ఉండలేక మధ్యాహ్నం ఒంటి గంటకు ఇంటికి వచ్చేస్తుంది. తిరిగి సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి ఎనిమిది వరకు ఆటో నడుపుతోంది. మళ్లీ రాత్రి తొమ్మిది నుంచి రెండుగంటల వరకు విరామం లేకుండా నడుపుతుంది. ఇలా మూడు షిఫ్టుల్లో మొత్తం మీద రోజుకి ఐదు నుంచి ఆరు వందల వరకు సంపాదిస్తోంది. స్థానిక ట్రాఫిక్ పోలీసులు నజ్మా ధైర్యాన్ని మెచ్చుకుని ప్రోత్సహిస్తున్నారు. అయితే నజ్మాను చూసిన ఓ హిందూ మహిళ కూడా ఆటో నడపడం మొదలు పెట్టింది. దీంతో ఆ మహిళ ఆర్థిక పరిస్థితులు కూడా మెరుగు పడ్డాయి. ఇలా ఇతరులకు స్ఫూర్తి నిలుస్తూనే, తన కష్టార్జితంతో హజ్ యాత్రకు వెళ్తానని చెబుతోంది నజ్మ.

అడుక్కునే కంటే...

"పేదరికం ఉందని అక్కడా ఇక్కడా చేయి చాచకుండా కష్టపడి ఏ పనైనా చేసి గౌరవంగా బతకవచ్చు. ఆటో గేర్లు మారుస్తూ, ప్రయాణికులను గమ్యాలకు చేరుస్తున్నాను. ఇక మహిళా డ్రైవర్‌గా నాకు రాత్రి సమయాల్లో కూడా ఎటువంటి ఇబ్బంది ఎదురు కాలేదు. ముఖ్యమంత్రి యోగి ప్రభుత్వం వచ్చాక అర్ధరాత్రి బయటకు రావడానికి కూడా భయం వేయడం లేదు. ప్రభుత్వ అధికార యంత్రాంగం మాకు రక్షణ కల్పిస్తోంది. పరిస్థితులు మరింత దిగజారినప్పుడు అల్లా కాపాడతాడు" అని నజ్మా అన్సారీ ధైర్యంగా చెబుతోంది.

యూత్ పల్స్

'ఇప్పటి వరకు ఇన్‌ఫ్లుయెన్సర్ పవర్ ఏమిటో చూశారు. ఇక డీఇన్‌ఫ్లుయెన్సర్ పవర్ ఏమిటో చూసే టైమ్ వచ్చింది'... ఇది తెలుగు సినిమాలో మాస్ డైలాగ్ కాదు. సోషల్ మీడియాలో ఒక కుర్రాడు పెట్టిన కామెంట్.

సోషల్ మీడియాలో ఇన్‌ఫ్లుయెన్సర్‌ల హవా నడుస్తున్న కాలం ఇది. కస్టమర్‌లు ఏది కొనాలో, ఏ షో చూడాలో, ఎలాంటి ఆరోగ్య సూత్రాలు పాటించాలో చెబుతున్నారు. ఇప్పుడు ఈ ట్రెండ్‌కు అడ్డుపడే 'డీఇన్‌ఫ్లుయెన్సింగ్' ట్రెండ్ యువతరం నుంచే వచ్చి బలపడుతోంది. ట్రెడిషనల్ ఇన్‌ఫ్లుయెన్సర్‌లు ఒక ప్రాడక్ట్‌ను హైప్ చేస్తే డీఇన్‌ఫ్లుయెన్సర్‌లు ఆ హైప్‌ను ఛాలెంజ్ చేస్తున్నారు....

ఢీ అంటే ఢీ

ఆర్ట్ ఆఫ్ డీఇన్‌ఫ్లుయెన్సింగ్





> సమస్య ఇన్‌ఫ్లుయెన్సర్‌లు కాదు. కొందరు ఇన్‌ఫ్లుయెన్సర్‌లు అనుసరిస్తున్న ధోరణి. వారిలో మార్పు రావాలి. సామాజిక బాధ్యత పెరగాలి. యువతలో అశాంతి, ఆందోళన రేకెత్తించే కంటెంట్‌కు దూరంగా ఉండాలి.
> – హిమాద్రి పటేల్, డిజిటల్ క్రియేటర్

మార్కెటింగ్ డాటా అండ్ ఎనలిటిక్స్ కంపెనీ కంతార్ స్టడీ రిపోర్ట్ ప్రకారం వినియోగదారులపై ఇన్‌ఫ్లుయెన్సర్‌ల సిఫారసుల ప్రభావం తక్కువేమీ కాదు. సోషల్ మీడియాలో ఎటు చూసినా ఇన్‌ఫ్లుయెన్సర్‌లు కనిపిస్తారు. టీ పొడుల నుంచి టీపాయ్‌ల వరకు రకరకాల ప్రాడక్ట్స్‌ను ప్రమోట్ చేయడానికి చిన్నచిన్న క్యాచీ వీడియోలను రూపొందిస్తారు. దీనికి భిన్నంగా ఒక ప్రాడక్ట్‌ను విశ్లేషిస్తూ విమర్శిస్తే...అదే డీఇన్‌ఫ్లుయెన్సింగ్!

'డీఇన్‌ఫ్లుయెన్సింగ్' హ్యాష్‌ట్యాగ్‌తో టిక్ టాక్‌లో ఈ ట్రెండ్ మొదలైంది.

సోషల్ మీడియా ఎనాలటిక్స్ ఫర్మ్ ట్యూబ్‌లర్ ల్యాబ్స్ చెబుతున్నదాని ప్రకారం గత సంవత్సరం నుంచి ఈ ట్రెండ్ ఊపందుకుంది. మ్యాడి వెల్ అనే ఇన్‌ఫ్లుయెన్సర్ ప్రముఖ కాస్మటిక్ స్టోర్స్‌లో పని చేసింది. కొన్ని ప్రాడక్ట్స్ పట్ల కస్టమర్‌లు ఎందుకు విముఖంగా ఉన్నారో తన స్వీయ అనుభవాలను తెలియజేసింది. ఈ ప్రభావంతో ఆమె పేరు ఇన్‌ఫ్లుయెన్సర్‌ల జాబితా నుంచి డీఇన్‌ఫ్లుయెన్సర్‌ల జాబితాలోకి చేరింది.

న్యూయార్క్‌కు చెందిన ఇరవై సంవత్సరాల క్లారా కొన్ని బ్రాండ్‌లను విమర్శిస్తూ వీడియోలు చేసింది. వాటిలో ఒకటి వైరల్‌గా మారింది. అదే సమయంలో తాను విమర్శించిన బ్రాండ్ నుంచి ఎలాంటి స్పందన వస్తుందో అనే భయం పట్టుకుంది. అయితే తనకు తానుగా ధైర్యం తెచ్చుకోవడానికి ఎంతో సమయం పట్టలేదు.

'నేను సరియైన వివరాలతోనే వీడియో చేశాను. నేనెందుకు భయపడాలి' అంటోంది క్లారా.

మన సెలబ్రిటీ ఒకరు ఆరోగ్య సంబంధమైన విషయాలపై కాస్త లోతుగానే మాట్లాడాడు. అయితే ఆయన అవగాహన లోపాన్ని ఒక వైద్యుడు వెంటనే ఎత్తిచూపాడు. పాపులర్ చైనీస్ వ్లోగర్ ఒకరు తన వయసు తక్కువగా కనిపించేలా సాంకేతిక మాయ చేస్తే ఎవరో కుర్రాడు కనిపెట్టి 'ఆయన అసలు రూపం ఇది' అని చూపాడు.

స్వీడన్ ఇన్‌ఫ్లుయెన్సర్ ఫేక్ ట్రిప్ గురించి మరొక యువకుడు 'ఇవి ఫొటోషాప్ చిత్రాలు' అని నిజాన్ని బహిర్గతం చేశాడు. నిజానికి ఇలాంటివి సోషల్ మీడియాలో గతంలో లేవని కాదు. అయితే 'డీఇన్‌ఫ్లుయెన్సింగ్' పుణ్యామా అని 'అది కాదు ఇది' అని వెంటనే సాధికార సమాచారంతో స్పందించే ధోరణి పెరిగింది.

డీఇన్‌ఫ్లుయెన్సర్‌లు వోవర్–హైప్‌డ్ ప్రాడక్ట్స్‌ను విమర్శించడమే కాదు చౌక ధరల్లో లభించే వాటి గురించి చెబుతున్నారు.

యూనివర్శిటీ ఆఫ్ పెన్సిల్వేనియాలోని వార్టన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ప్రొఫెసర్ అయిన అమెరికస్ రీడ్ ఇలా అంటున్నారు... 'ఇన్‌ఫ్లుయెన్సర్‌లలో ఎక్కువ మంది సాధికారికంగా మాట్లాడడం లేదేమో అనే భావన కస్టమర్‌లలో వచ్చింది. డబ్బులు ఇస్తారు కాబట్టి సంబంధిత ప్రాడక్ట్‌ను ప్రమోట్ చేస్తారు. నిజానిజాల గురించి వారికి అవసరం లేదు. ఈ నేపథ్యంలో కాస్తో కూస్తో డీఇన్‌ఫ్లుయెన్సరే నయం అనుకుంటున్నారు. నిజానికి డీఇన్‌ఫ్లుయెన్సర్ కూడా ఇన్‌ఫ్లుయెన్సరే'

కొందరు ఒక అడుగు ముందుకు వేసి ఈ ట్రెండ్‌కు 'యాంటీ క్యాపిటలిస్ట్' ట్రెండ్‌గా నామకరణం చేశారు.

డీఇన్‌ఫ్లుయెన్సింగ్ ట్రెండ్ వల్ల వృథా ఖర్చులు తగ్గుతాయని, వేలం వెర్రికి అడ్డుకట్టపడుతుందని, పర్యావరణ కోణంలో కూడా ఈ ట్రెండ్ వల్ల మేలు జరుగుతుందని యువతరంలో ఎంతోమంది బలంగా వాదిస్తున్నారు. తమ అభిప్రాయాలను సామాజిక మాధ్యమాలలో ఇతరులతో పంచుకుంటున్నారు. అయితే 'డీఇన్‌ఫ్లుయెన్సింగ్' ట్రెండ్‌పై ప్రశంసలతో పాటు విమర్శలు కూడా ఉన్నాయి.

డీఇన్‌ఫ్లుయెన్సింగ్‌కు విషయ సాధికారత, నిజాయితీ అనేవి కీలకం. అయితే 'డీఇన్‌ఫ్లుయెన్సింగ్' రూపంలో సూడో–అథెంటిసిటీ ముందుకు వస్తుందని, ఈ ట్రెండ్‌ను తమ స్వార్థానికి ఉపయోగించుకునే వారి సంఖ్య పెరుగుతుందనే విమర్శ ఉంది.

'ఈ ట్రెండ్ కాస్త చివరికి ఎలా మారుతుందంటే ఇది కొనవద్దు. మీరు కొనాల్సింది అది అన్నట్లుగా!' అంటుంది 26 సంవత్సరాల అమెరికన్ ఇన్‌ఫ్లుయెన్సర్ జెస్సిక.

'ముఖ్యమైన విషయం ఏమిటంటే ఇన్‌ఫ్లుయెన్సర్‌లు చెప్పగానే కస్టమర్‌ల అభిప్రాయాలు రాత్రికి రాత్రి మారిపోవు. ఇన్‌ఫ్లుయెన్సర్‌లు కేవలం సలహా ఇస్తారు. అంతే. ఏది కొనాలి, ఏది కొనకూడదు అనే స్వీయవిచక్షణ కస్టమర్‌లలో ఉంది. ఇన్‌ఫ్లుయెన్సర్‌లుగా మేము పారదర్శకంగా, నిజాయితీగా ఉంటాం' అంటుంది ఫ్రాన్స్‌కు చెందిన ఇన్‌ఫ్లుయెన్సర్ కోలిన్. ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో 4,00,000 ఫాలోవర్స్ ఉన్నారు.

ప్రస్తుతం డీఇన్‌ఫ్లుయెన్సింగ్ ట్రెండ్ హెల్త్, ఫైనాన్స్, లైఫ్‌స్టైల్ విభాగాలలో ఎక్కువగా కనిపిస్తుంది.

'డీఇన్‌ఫ్లుయెన్సింగ్ అనేది వాపా బలుపా?' అనేది పక్కన పెడితే ఈ ట్రెండ్ మూలంగా ఇన్‌ఫ్లుయెన్సర్‌లు ప్రాఫిట్‌కు మాత్రమే కాదు మెరిట్‌కు కూడా ప్రాధాన్యత ఇచ్చే ధోరణి, జవాబుదారీతనం పెరుగుతుంది.

బ్యూటిప్స్



● వేప చెట్టు ఇంటి దగ్గర్లో ఉంటే వేరే సౌందర్యసాధనాలతో పనే ఉండదు. వేపాకులు, బెరడు, వేపనూనె ఔషధాలుగానే కాదు, సౌందర్య సాధనాలుగానూ ఉపయోగపడతాయి. ఎలాంటి చర్మ సమస్యలకైనా వేపతో ఇట్టే చెక్ పెట్టేయవచ్చు. ● ముఖంపై మొటిమలు, నల్లమచ్చలు ఏర్పడుతుంటే వేపాకులతో చక్కని విరుగుడు ఉంది. గుప్పెడు వేపాకులను అరలీటరు నీటిలో వేయాలి. వేపాకులు పూర్తిగా మెత్తగా మారిపోయేంత వరకు ఆ నీటిని మరిగించాలి. కాసేపటికి నీరు ఆకుపచ్చ రంగులోకి మారుతుంది. అప్పుడు వడగట్టి ఆ కషాయాన్ని సీసాలో భద్రపరచుకోవాలి. ప్రతిరోజూ రాత్రి పడుకునే ముందు ఆ నీటితో కాస్త దూదిని తడిపి ముఖాన్ని రుద్దుకుంటే చాలు. మొటిమలు, మచ్చలు మటుమాయం అవుతాయి. ● చర్మం పొడిబారి, తరచు దురదలు పెడుతున్నట్లయితే, పైన చెప్పుకున్నట్లే వేపాకులతో కషాయం చేసి, బకెట్ నీటిలో ఒకకప్పు కషాయాన్ని పోసి ఆ నీటిని స్నానానికి ఉపయోగిస్తే చాలు. కొద్దిరోజుల్లోనే చర్మం ఆరోగ్యకరంగా మారుతుంది. ● ముఖం తరచు జిడ్డుగా మారుతుంటే, వేపాకుల పొడి, గంధంపొడి, గులాబి రేకుల పొడి సమభాగాలుగా తీసుకుని కలుపుకోవాలి. చెంచాడు పొడిలో మూడు నాలుగు చుక్కల వేపనూనె, కొద్దిగా తేనె, నిమ్మరసం పిండుకుని ముద్దలా కలుపుకోవాలి. దానిని ముఖానికి పట్టించి, అరగంటసేపు ఆరనివ్వాలి. పూర్తిగా ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇలా చేస్తే ముఖం తాజాగా మారుతుంది.

